


నడకలో రాజసం..
చూపులో గాంభీర్యం...
అడవికే రారాజు...
నేడు ప్రపంచ పులుల దినోత్సవం..
7


## కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

నస్పూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్యకు అందించారు. అంతకు ముందుగా ప్రధాన రహదారి ప్రధాన ద్వారం వద్ద నుంచి ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ మాట్లాడుతూ టైగర్ జోన్‌ను పూర్తిగా ఎత్తి వేయాలని, 49 జీవోను పూర్తిగా రద్దు చేయాలన్నారు. పోడు వ్యవసాయానికి పట్టాలను ఇవ్వాలన్నారు. వైల్డ్‌లైఫ్ సంచార్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దసళి పట్టు గూళ్ల రైతుల మీద అటవీ శాఖ అధికారుల దాడులు ఆపాలని, పంట వేసే వెసులు బాటు కల్పించాలన్నారు. ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెడంకి మాంతయ్య, దుగ్నె జయులు, బాపులతో పాటు వివిధ మండలా లకు చెందిన పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.

## టైగర్ జోన్‌లో ఆంక్షలు ఎత్తివేయాలి

- ఎర్రబెల్లి రఘునాథ్‌రావు



రిలే దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి రఘునాథ్‌రావు

జన్నారం, జూలై28 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం, దండేపల్లి, కడెం మండలాల అభివృద్ధి చెందాలంటే టైగర్‌జోన్‌లో ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి రఘునాథ్‌రావు అన్నారు. 13వ రోజు రిలే దీక్షలో పాల్గొని మద్దతు పలికారు. అదే విధంగా ఖానాపూర్ రైతు నేత, సదర్మట్‌కాలువా సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్ అపావత్ మాట్లాడుతూ కవ్వాల్ టైగర్‌జోన్ పేరుతో ఇక్కడి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కవ్వాల్ అభయారణ్యంలోని పులుల అభయారణ్యంగా మార్చి ఇక్కడ ఉన్న యువతకు ఉపాధి లేకుండా భారీ వాహనాలను అనుమతించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కొప్పుల లచ్చన్న, శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు బద్రీనాథ్, రమేశ్‌గౌడ్, మధుసూదన్, గోలి చందు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల పేరిట ప్రభుత్వ భూములు స్వాహా..!

- కోట్ల విలువైన స్థలాల్లో అక్రమార్కుల పాగా
- మందమర్రి మండలం తిమ్మాపూర్‌లో ఘటన
- చేతులు మారిన సుమారు 40 ఎకరాలు
- అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేసిన రియల్టర్లు



సర్వే నంబర్ 438లో వెలిసిన గుడి

మంచిర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రభుత్వ భూములపై కన్నేస్తున్న రియల్టర్లు వాటిని చేజి క్కించుకునేందుకు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. గుళ్లు, ఆశ్రమాల నిర్మాణం పేరుతో సర్కారు భూముల్లో పాగా వేస్తూ, సమయం చూసుకొని వాటిలో అక్రమంగా ప్లాట్ల వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అడిగేవారు కరువయ్యారు. మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారులో గల ప్రభుత్వ భూమిలో గతంలో ఓ ఆశ్రమం పుట్టుకురాగా, తాజాగా మరో అతిపెద్ద గుడి నిర్మాణం జరుగుతోంది. వాటిని ఆనుకొని గోశాల ఏర్పాటు చకచకా జరిగిపోయాయి.

### ఇరవై ఎకరాలు అన్యాక్రాంతం...

తిమ్మాపూర్ శివారులోని సర్వే నెంబర్ 438లో 75 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమి లో కొందరు భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం జీవనోపాధి కోసం గతంలో కొంత స్థలాన్ని అసైన్ చేసింది. మిగతా భూమిలో 20 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లగా, ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్లు కూడా అయ్యాయి. ప్రస్తుతం ఆ స్థలం విలువ ఎకరా రూ. కోటి పై చిలు కు ధర పలుకుతోంది. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన స్థలంలో గతంలో ఓ ఆశ్రమం నిర్మాణం జరుగగా, తాజాగా ఓ పెద్దగుడిని సైతం నిర్మాణంలో ఉంది. అదే స్థలంలో ఓ రెండంతస్థుల భవనం కూడా నిర్మితమైంది. ట్రస్టు పేరిట గుళ్లు నిర్మిస్తుండగా, ప్రభుత్వపరంగా దానికి ఎలాంటి అనుమతులు లేవు. అలా గుడి, ఆశ్రమం పేరిట స్థలాన్ని ఆక్రమించి, వాటిని అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి, యథేశ్చగా ప్లాట్లను విక్రయిస్తున్నారు.

### అదే శివారులో మరో 20 ఎకరాలు...

మందమర్రి మండలంలోని తిమ్మాపూర్ శివారులో నే మరో 20 ఎకరాల ప్రభుత్వ స్థలం కూడా అన్యా క్రాంతం అయింది. తిమ్మాపూర్ శివారులోని సర్వే నెం బర్ 325లో గాంధారి మైసమ్మ ఆలయం వద్ద జాతీయ రహదారిని ఆనుకొని 20 ఎకరాలు కొందరి పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు అయ్యాయి. జాతీయ రహదారి పక్కన ఉండటంతో వాటి విలువ ఎకరాకు రూ. 2 కోట్లపై చిలుకు ధర పలుకుతోంది. ఆ భూముల్లోనూ పట్టాలు పుట్టుకురాగా, అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి, విక్రయిస్తున్నారు. రెండు సర్వే నంబర్లలోని 40 ఎకరాలు మాజీ సైనికుడు నాయిని చిన్న, అలియాస్ నాయిని చిన్న సిపాయి పేరుతో పట్టా ఉంది. చాలా కాలం గా ఈ భూముల్లో పట్టాదారుకు...

- మిగతా 7లో

## 30న వాహనాల వేలం

లక్సెట్టిపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీన లక్సెట్టిపేట పట్టణంలోని అబ్కారీశాఖ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుకున్న 15ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఆశాఖ సీఐ సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ఉదయం 11గంటలకు ప్రారంభం అవుతుందని వేలంలో పాల్గొను అభ్యర్థులు ఒక రోజు ముందు దరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## పాలిటెక్నిక్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్

శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిషత్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు అన్నారు. పాలిటెక్నిక్ మొదటిసంవత్సరం విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, టెక్నికల్ విద్య ఉపాధి చూపుతుందన్నారు. ఏ కోర్సులో చేరినా ఉపయోగకరంగా ఉంటుందని తెలి పారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించాల ని, భవిష్యత్తులో స్థిరపడేందుకు కృషి చేయా లని విద్యార్థులకు సూచించారు. మైనింగ్ విభాగాధిపతి నరసింహస్వామి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి నారాయణ మూర్తి, కంప్యూటర్స్ విభాగాధిపతి రవీందర్, మెకానికల్ విభాగాధిపతి దామెదర్, సివిల్ విభాగాధిపతి శ్యామల, సీనియర్ లెక్చరర్ కె. సుమన్ కోర్సులు, వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

తాండూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, పదేండ్లుగా నిర్వీర్యం అయిన రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేసి మాట నిలబెట్టుకుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో 475 మంది లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమపథకాలు లబ్ది పొందాలంటే రేషన్ కార్డు ప్రమాణికం అని, కానీ గత 10 ఏండ్లలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులు పెట్టిందన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కిష్టంపేటలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

## నేడు కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవం

హాజీపూర్, జూలై28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేటలో గల కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవం మంగళవారం జరుగనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ, కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, కేంద్రం తరుపున రాష్ట్ర విద్యాశాఖ ఎడ్యూకేషన్, ఇండిపెండెంట్ మినిష్టర్ జయంత్ చౌదరి, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కలెక్టర్, కేవీ స్కూల్ చైర్మన్ కుమార్ దీపక్‌లు ఈ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇటీవల ఈ కేంద్రీయ విద్యాలయ పీఎంశ్రీ పథకానికి కూడ ఎంపికైంది. 2016 అక్టోబర్ 16న జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు భవన్‌లో ఇప్పటి వరకు నిర్వహించారు. 2021లో గుడిపేట శివారులో 9 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రూ. 26.9కోట్లతో 2022 మే1న భూమి పూజ చేశారు. 2025 ఏప్రిల్ 15 నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పాఠశాలలో 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గుడిపేటలో నూతనంగా నిర్మితమైన కేంద్రీయ విద్యాలయానికి మంచిర్యాల కలెక్టర్ చొరవ తీసుకొని నస్పూర్, క్యాతన్‌పల్లి నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. మంగళవారం ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల యాజమాన్యం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## వైద్య సేవలపై అప్రమత్తంగా ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి
- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



ఆసుపత్రిని పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వైద్య సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కు మార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సదుపాయాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలందించి వ్యాధి తగ్గేలా చూడాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ప్రభుత్వ ఆదే శానుసారం రికార్డులను మె యింటెన్ చేయాలన్నారు. డయాగ్నొస్టిక్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను వివరాలను రోజువారీగా విశ్లేషణ చేయాలన్నారు. డెంగ్యూ తదితర పరీక్షలను టీ హబ్‌లో పరీక్షలు చేసి నిర్ధారణ చేసిన తర్వాతనే డీఎంహెచ్‌వో ప్రకటించాలన్నారు. ఐఈసీ (ఇన్‌ఫర్‌మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్) వ్యవస్థ ద్వారా వైద్య సేవలపై చిత్రలేఖనం ద్వారా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, సూపరింటెండెంట్ హరిశ్చంద్రరెడ్డి, వైద్యాధి కారులు భీష్మ, శ్రీధర్, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రసాద్, అనిత, కృపాబాయి, సీతారామరాజు, సుధాకర్‌నాయక్, శ్రీనివాస్ ఉన్నారు.

### నిబంధనలకు లోబడి ప్రైవేటు ఆసుపత్రులు పనిచేయాలి

ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రైవేటు ఆసుపత్రులు పనిచేయాలని కమిషనర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓంసాయి ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలని, అర్హత లేకుండా వైద్యం అందిస్తే చర్యలు తీసుకుం టామని తెలిపారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లక్సెట్టిపేట: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్య విధాన్ పరిషత్ రాష్ట్ర కమిషనర్ అజయ్‌కుమార్ వైద్యులను ఆదేశించారు. సోమవారం లక్సెట్టిపేట పట్టణంలోని 30పడకల ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని పలు వార్డులను తిరుగుతూ రోగులతో మాట్లాడి వాళ్లకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట టీవీవీపీ జిల్లా ప్రత్యేకాధికారి ఈ. శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, వైద్యులు సురేష్, కృష్ణ, స్రవంతిరావు, పవిత్ర, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

### రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

బెల్లంపల్లి: వర్షాకాలం నేపథ్యంలో సీజన్ వ్యాధులు ప్రబలించి రో గులు ఆసుపత్రికి వస్తారని మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం వందపడకల ఏరియా ఆసుపత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కోటేశ్వర్, రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, జూలై28 (ఆంధ్రజ్యోతి): మండలంలో అపరిష్కృతంగా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మాదిగహక్కుల దండోర మండల అధ్యక్షులు అట్కపురం రమేశ్ ప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలవల్ల గ్రామీణ ప్రాంతాల రోడ్లు చిత్తడిగా మారాయి. అలాగే గ్రా మాల్లో సరైన సానిటేషన్ లేక దోమలు పెరిగిపోయాయి. రోడ్లపై తిరుగుతున్న పిచ్చి కుక్కలవల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. దేవాపూర్‌లో రోడ్లపై ఆవులను వదిలివేయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే వీటిపై సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### పాఠశాల ఏర్పాటు చేయాలని వినతి

తాండూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలాన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వపాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కొండు బానేష్ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిం చారు. గ్రామంలో ప్రాథమికపాఠశాల లేకపోవడంతో 20మంది పిల్లలు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న రేచిని గ్రామంలోని పాఠశాలకు కాలినడకన వెళ్లి చదువుకుంటున్నారని తెలిపారు. వెంటనే పాఠశాలను ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు.

## వన్య ప్రాణులకు హాని తలపెట్టద్దు



లేగదూడ యజమానికి నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న అటవీ అధికారులు

- బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్

కాసిపేట, జూలై28 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులకు ఎవరు కూడ హానీ తలపెట్టవద్దని బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో సిహెచ్ పూర్ణ చందర్ అన్నారు. కాసిపేట మండలంలోని వెంకటా పూర్ అటవీశివారు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఆవుల మందపై పులిదాడి చేసి లేగదూడను చంపింది. లేగదూడ యజమాని కుర్సింగ అచ్యుత్‌రావుకు 8వేల నష్టపరిహారం చెక్కును బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల దాడిలో రైతులకు నష్టం జరిగితే 24గంటల్లోనే నష్టపరిహారం అందజేస్తామన్నారు. కాబట్టి ఎవరు కూడ వన్యప్రాణులకు హానీ తలపెట్టవద్దని ఆయన సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత కాబట్టి ప్రతి ఒక్కరు వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే సోనాపూర్, వెంకటాపూర్, తిరుమలాపూర్, రొట్టేపల్లి, లక్ష్మీపూర్ అటవీ శివారు ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తుంది. కాబట్టి ఎవరు కూడ ఒంటరిగా అడవిలోకి వెళ్లకూడదని సూచించారు. ఎవరి కైన పెద్దపులి అవనా వాళ్ల కనిపిస్తే వెంటనే స్థానిక అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు సిహెచ్ యుగేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను చిన్న చూపు చూడడం సరికాదు



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట నాయకులు

మందమర్రిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకుడు పోడేటి సంజీవ్, భుక్యకిరణ్‌లు పేర్కొన్నారు. సోమవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ గత ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు సంబంధించి విద్యారంగం వివక్ష ఎదుర్కొందని, ఉపాధ్యాయులు కూడా పదోన్నతులకు నోచుకోలేదన్నారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం తమకు బాధ కలిగిస్తోందన్నారు. మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వెంటనే పెండింగ్ డీఏలు, పీఆర్‌సీని వెంటనే చెల్లించాలని, అన్నిరకాల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, తరగతికి ఒకటీచర్ ఉండాలని తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఆగస్టు 1న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో నాయకులు ప్రకాష్,రమేష్, రాజమల్లు పాల్గొన్నారు.

### ధనోర వద్ద సబ్ స్టేషన్ మంజూరు

కెరమెరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ సర్కిట్ పరిధిలోని కెరమెరి మండలం ధనోర గ్రామం వద్ద కొత్త సబ్ స్టేషన్ మంజూరు అయినట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

### అనారోగ్యంతో రిటైర్డ్ పీఈటీ మృతి

కాగజ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బాలభారతి హైస్కూల్ రిటైర్డ్ పీఈటీ వినోద్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ఆరోగ్యం విషమించి సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మృతి పట్ల విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

### కస్తూర్బా పాఠశాల తనిఖీ

కాగజ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కస్తూర్బా పాఠశాలను సోమవారం ఎంపీడీవో కోట ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వివిధ సమస్యపై అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వివిధ సమస్యపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం

లింగాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముచ్చర్ల సత్తన్న గ్రామపంచాయతి అవార్డు గ్రహిత మండలంలోని పిక్లాతండా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నూనావత్ మంగ్లిబాయి కిషన్‌కు సోమవారం మండలంలో బీఆర్ఎస్ నాయకులు కలసి శాలువాతో సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గత వారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూపిక్లాతండా మాజీ సర్పంచ్ నూనావత్ మంగ్లిబాయి కిషన్‌కు అవార్డు రావడం గర్వకారణం అన్నారు. కార్యాక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్యానాయక్, మండల నాయకులు కిషన్, విజేస్, రాహుల్ పాలొన్నారు.

### మాదకద్రవ్యాలపై అవగాహన

వాంకిడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని లెండిగూడ గ్రామంలో మాదకద్రవ్యాలపై గ్రామస్థులకు ఏఎస్సై పోశెట్టి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సన్మార్గంలో నడవాలని, మాదక ద్రవాల్యకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంల్లో గంజాయి విక్రయించినా సేవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కౌలు రైతు..కన్నీటి సేద్యం



- జాడలేని రూ. రెండు లక్షల రుణం
- రైతు భరోసా కింద కౌలు రైతులకు గుర్తించేదెప్పుడు?
- కార్యరూపం దాల్చని కాంగ్రెస్ ఎన్నికల హామీ

కౌటాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుర్తించకపోయినా బ్యాంకు రుణం ఇవ్వకపోయినా బతుకు దెరువు కోసం కౌలు రైతులు కష్టాల సేద్యం చేస్తున్నారు. భూమిని నమ్ముకుని కష్టపడి పనిచేసే కౌలు రైతుకు ఎక్కడా సాయం అందడం లేదు. పండినా పండకపోయినా వారు కౌలు మాత్రం కడుతూ వస్తున్నారు. రైతుబంధు పథకం కింద ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు పట్టా రైతుల ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. దీంతో వాస్తవంగా పంటను సాగు చేసిన కౌలు రైతు పేరు ఎక్కడా రికార్డుల్లో లేకుండా పోతోంది.

#### అమలు కాని ఆర్‌బీఐ ఉత్తర్వులు..

కౌలు రైతుల విషయంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కొంత ఉదారంగా వ్యవహరించింది. కౌలు రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టే వారికి గరిష్ఠంగా రెండు లక్షల బ్యాంకు రుణమివ్వాలని గతేడాది జారీచేసిన ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. సొంత భూమి ఉన్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఆధారం చేసుకొని పంట రుణాలు ఇచ్చినట్లే కౌలు రైతులను ఆదుకోవడానికి ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించింది. కానీ రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావడంలేదు. ఏ ఆధారం లేకుండా కౌలు రైతులకు రుణం ఇవ్వడానికి ససేమీరా అంటున్నాయి. దీంతో ఆర్‌బీఐ ఉత్తర్వులు బుట్టదాఖలు అయ్యాయి.

#### భూ అధీకృత చట్టం కింద..

భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలుచేసి కౌలు రైతుల గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈసందర్భంగా 2023 సెప్టెంబరు 13న అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖను గుర్తు చేస్తున్నారు. ఆ లేఖలో కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని, భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలుచేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మళ్లీ ఇస్తామని, రైతు భరోసాతో పాటు ఇతర పథకాలు, పంట రుణాలను కూడా అందిస్తామంటూ హామీ ఇచ్చారని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌తో పాటు ఆరు గ్యారెంటీల్లోనూ కౌలు రైతులకు కూడా పథకాలు ఇస్తామని పేర్కొన్నారని అంటున్నారు. రుణ అర్హత కార్డుల విధానాన్ని పునరుద్ధరించాలని, భూమి పత్రాలపై ఆధారపడకుండా రుణాలివ్వాలని కౌలు రైతులు కోరుతున్నారు.

#### రైతు భరోసా కింద గుర్తింపు ఏదీ?

రైతు భరోసా కింద కౌలు రైతులను గుర్తిస్తామని ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఈ అంశాన్ని ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే రైతులతో పాటు కౌలు రైతులను కూడా గుర్తించి వారికి రైతు భరోసా కింద ఆర్థికసాయం చేస్తామని చేసిన ప్రకటన కూడా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదు. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు, అకాల వర్షాలతో పాటు ప్రభుత్వం తోడ్పాటు లేకపోవడంతో కౌలు రైతులు ఆర్థికంగా కుదేలు అవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 25 శాతం పంటలు కౌలు రైతులే పండిస్తున్నారు. కౌలు రైతులను అధికారికంగా గుర్తించేందుకు సరైన విధానం లేక పోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ పథకాలు భూ యజమానులకే వర్తిస్తున్నాయి. కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. వారికి గుర్తింపు లేకపోవడంతో బ్యాంకు రుణాల మంజూరుకు నిరాకరిస్తున్నాయి.

#### రుణ అర్హత కార్డులేవీ?

గతంలో కౌలు రైతులను ఆదుకునేందుకు రుణ అర్హత కార్డులు(ఎల్ఈసీ) జారీ చేశారు. వీటి ద్వారా వారు బ్యాంకు నుంచి కొంత మేరకు రుణాలు పొందేవారు. పంటలు పండిన తరువాత వచ్చిన ఆదాయంలో కొంత రుణాలు తీర్చేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలాకాలం వరకు ఇది అమలులో ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్డులను రద్దు చేసింది. కౌలు రైతులను మరో విధంగా ఆదుకుంటామని వాగ్దానం చేసింది. హామీ ఆ తరువాత అటకెక్కింది.

## పోలీసు పహారా నడుమ యూరియా పంపిణీ



యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయానికి తరలి వచ్చిన రైతులు

దహెగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో సోమవారం పోలీసుల పహారా మధ్య యూరియా పంపిణీ చేశారు. యూరియా పంపిణీ విషయం రైతులకు తెలియడంతో అటవీ ప్రాంత గ్రామాలైన రాంపూర్, మొట్లగూడ, రావుపల్లి, ఒడ్డుగూడ, తదితర గ్రామాల రైతులు ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. రాత్రి వరకు యూరియా పంపిణీ కొనసాగింది. ఎకరానికి ఒక బస్తా చొప్పున పంపిణీ చేయడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 888 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు సహకార సంఘం అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బక్కయ్య, సిబ్బంది జీవన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనల ప్రకారం రుసుం వసూలు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మీ సేవ కేంద్రాల్లో వివిధ సేవలకు నిర్ణయించిన ప్రకారం రుసుం వసూలు చేయాలని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతంరాజ్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ మీ సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిటిజన్ చార్ట్‌ను, ధ్రువపత్రాల నమోదు రిజిస్టర్, నిర్వహణ, ఫిర్యాదుల నంబర్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విరుద్ధంగా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా అధిక రుసుం వసూలు చేస్తే టోల్ ఫ్రీ 1100, లేదా ఈ-డిస్ట్రిక్ మేనేజర్ 7995016036 నంబర్లకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు.

### ఎన్‌హెచ్‌ఆర్‌సీ బహిరంగ విచారణ

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) హైదరాబాద్‌లో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్-2లో 52 కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోని పరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్ని కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది.

**- నా కుమారుడి చావుకు పాస్టరే కారణం**

మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం కొండాపూర్ నుంచి ఓ తల్లి న్యాయం కోసం ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. ఇంటర్ చదువుతున్న తన కుమారుడు 17ఏళ్ల గంధం చరణ్‌ను అదే గ్రామానికి చెందిన పాస్టర్ మన్నె లింగయ్య అలియాస్ సామ్యూల్ బాప్టిజం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి తమకు తెలియకుండా అక్కడికి దగ్గరలోని ద్వారకా రేవుకు తీసుకెళ్లాడని ఆమె ఆరోపిస్తున్నారు. తిరిగి శవమై ఇంటికి తిరిగి వచ్చిన నా బిడ్డను చూసి, అసలు ఏమి జరిగిందని నిలదీస్తే... గోదావరిలో స్నానం చేస్తుండగా మునిగి చనిపోయాడని చెప్పారని కన్నీరుమున్నీరయ్యారు. మైనర్ అయిన తన కుమారుడిని చెప్పాపెట్టకుండా మతమార్పిడికి పాల్పడినందుకు తీసుకెళ్లి, వాడి చావుకు కారణమైన లింగయ్యను శిక్షించాలని ఆ తల్లి జాతీయ మానవహక్కుల కమిషన్‌ను కోరారు.

### అట్టహాసంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మోడల్ స్పోర్ట్స్ పాఠశాల క్రీడామైదానంలో సోమవారం ట్రాక్‌అండ్ ఫీల్డ్‌లో అట్టహాసంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటార్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ చిరంజీవి, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు, మంగపతి, హరికృష్ణ, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, వనిత, పీడీలు వెంకటేష్, శారద, పీఈటీ బాలాజీ, పోజియా, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

### ఇంగ్లీష్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఇంగ్లీష్ సబ్జెక్టు అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమాధికారి రమాదేవి అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవో ఆదేశాల మేరకు పాఠశాలలో యంగ్ లీడర్, క్లబ్ భారత్ దేఖో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 6 నుంచి 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు మూడు రో జుల శిక్షణ ఇస్తున్నాని తెలిపారు. క్యాక్రమంలోఏటీడీవో చిరంజీవి, శ్రీనివా స్, డీఎస్‌వో మీనారెడ్డి, సంస్థ ప్రతినిధులు అభిజిత్, ఆర్పీలు పాల్గొన్నారు.

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

కాగజ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందులకు ఔట్ సోర్సింగ్ ఇద్దరు ఉద్యోగులను తొలగిస్తూ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం విద్యార్థినిలు స్వయంగా వండుకోవటంపై పలు ఫిర్యాదులు రావటంతో సోమవారం విచారణ జరిపిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే వంట మనిషిని కూడా సస్పెండు చేశారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి

లక్షెట్టిపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం అంకత్‌పల్లి గ్రామంలో గెల్లు మౌనిక(30) అనే వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మౌనికకు పదేళ్ల క్రితం హాజీపూర్ మండలం పెద్దంపేటకు చెందిన మహేష్‌తో వివాహం అయింది. ఆరేళ్ల కూతురు, ఎనిమిది నెలల కొడుకు ఉన్నారు. మౌనిక రెండు నెలల నుంచి తల్లిగారి ఇంట్లోనే ఉంటోంది. మృతురాలు ఈనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

### దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

కాసిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమ్మతల్లి గుడిసమీపంలో జరిగిన దాడిలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముత్యంపల్లికి చెందిన గిన్నె సతీష్ ఆదివారం సాయంత్రం పెద్దమ్మతల్లి గుడి నుంచి ఇంటికి కాలి నడక తిరిగి వస్తుండగా బైక్‌పై అతివేగంగా వచ్చిన ముదురుకోళ్ల రాజు ఆవుల రాజేందర్‌లను నెమ్మదిగా వెళ్లాలని సతీష్ సూచించారు. తమను నెమ్మదిగా వెళ్లమంటావా అని సతీష్‌పై దాడి చేసి వెనక్కి నెట్టేశారు. దీంతో సతీష్ బండరాయిపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి చెల్లెలు ముత్యాల లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

### రోడ్లను బాగు చేయండి



నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

తిర్యాణి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతల మయం కావడం వల్ల ప్రజలు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారని దశాబ్దాలుగా ఇదే పరిస్థితి నెలకొందని వెంటనే రోడ్డు నిర్మించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి భగవతరావు డిమాండ్ చేశారు. సోమవారం కుమరం భీుూం చౌరస్తాలో నిరసన తెలిపారు. రోడ్డు బాగు చేయండి సారూ... అంటూ ప్రభుత్వాన్ని వేడుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తిర్యాణి రోడ్డు బాగు పడడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్ము, గణపతి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### షీ టీం సేవలపై అవగాహన

వాంకిడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీం సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు స్వప్న, దినేష్, రజిని విద్యార్థినుల భద్రతా చట్టాలను వివరించారు. అపద సమయంలో ఎలా స్పందించాలో, డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనే షీ టీం 8712670564 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి తదితరులు ఉన్నారు.




అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

### పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి




ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు

ఆసిఫాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలను చెల్లించాలని, 10 నెలల కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలి, వెంటనే వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ ప్రకారం అదనపు బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, ఆనంద్‌కుమార్, శారద, శ్రీనివాస్, కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.




### క్రీడాకారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి క్రీడాకారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్ ఇండియా, పబ్లిక్ సెక్టార్లలో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులకు స్పెషల్ అలవెన్సులు, ప్రత్యేక ఇంక్రిమెంట్లు, పదోన్నతుల్లో స్పెషల్ కోటా కల్పించాలని కోరారు. అలాగే క్రీడా మైదానాలు అందుబాటులో ఉండేవిధంగా క్వార్టర్లు కేటాయించాలని, సింగరేణి వ్యాప్తంగా ఉన్న క్రీడామైదానాలు, జిమ్‌లను ఆధునీకరించాలన్నారు. ఆటల పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు డ్యూటీ చేసుకునేందుకు వారికి అనుకూలమైన షిఫ్టులు మార్చాలన్నారు. గత వార్షిక సంవత్సరాల్లో 190/240 మస్టర్లు చేసిన బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

### బీసీ ఎంప్లాయిస్ పిట్ కమిటీ

శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఓసీపీ పిట్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. బ్రాంచ్ కార్యదర్శులు బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్ సమక్షంలో పిట్ కార్యదర్శిగా వీర్ల మదన్, సహాయ పిట్ కార్యదర్శిగా మల్లెత్తుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా దుబ్బల రవి, ముఖ్య సలహాదారుగా శ్రీధర్‌రావు, రిలే ఇన్‌చార్జిలుగా స్వామి, లక్ష్మీనారాయణ, ఓదెలు, రాజేందర్ ఎన్నికయ్యారు. వీరిని నాయకులు అభినందించారు.

## లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పొందిన లాభాల్లో ఉద్యోగులకు 35 శాతం వాటా చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెలలు గడిచినా ఇంతవరకు లాభాలను ప్రకటించలేదన్నారు. టీబీజీకేఎస్ హయాంలో ఒక్క స్ట్రక్చర్ సమావేశం జరగేలదని, తాము గుర్తింపు సంఘంగా ఎన్నికైన అనంతరం మూడు సమావేశాలు జరిగాయని, పలు సమస్యలను కార్మికుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశామని పేర్కొన్నారు. కార్మికుల సొంతిటి కల నెరవేర్చేవిధంగా యాజమాన్యాన్ని ఒప్పించామన్నారు. వివిధ కారణాలతో డిస్మిస్ అయిన జేఎంఈటీలను తిరిగి ఉద్యోగంలోకి తీసుకునేలా కృషి చేశామన్నారు. ఏఐటీయూసీ చేసే ప్రతీ పనిని తామే చేశామని ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, ఇది ఎంతమాత్రం తగదన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆయన అన్నారు. సమావేశంలో ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు సంపత్, బద్రి బుచ్చయ్య, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి, ఉత్పాదకతలో కార్మిక సంఘాలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి, ఉత్పాదకతలో కార్మిక సంఘాలది కీలకపాత్ర అని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. సోమవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తోందన్నారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల కంటే అదనపు ఉత్పత్తి సాధించేలా గుర్తింపు సంఘం కార్మికులకు చైతన్యం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో ఉద్యోగులు ఎప్పుడు ముందుంటున్నారని, వారి కృషి వల్లనే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందన్నారు. ఉద్యోగులకు ఉత్పత్తికి సంబంధించి నాణ్యమైన పాదరక్షలు, డ్రిల్ రాడ్లు, ఎక్స్‌పోదర్లు అందజేయాలన్నారు. యాజమాన్యం ముందు ఉంచిన 16 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, పీఎం శ్యాంసుందర్, గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఓసీపీ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, స్టోర్ డీజీఎం సురేష్, ఏరియా ఇంజనీర్ బాలాజీభగవతి, ఐఈడీ కిరణ్‌కుమార్, సివిల్ ఎస్ఈ రాము, డీవైపీఎం సందీప్, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, అక్బరలీ, భీమనాధుని సుదర్శన్, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కనీస వేతనాలు అందించాలి

శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 ఏళ్లుగా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కోల్‌ఇండియాలో మాదిరిగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటికీ హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బొగ్గు బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, బొగ్గు పరిశ్రమల భవిష్యత్తు, సాంకేతికత సామర్థ్యం పరిరక్షణకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని, కార్మికులు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో కేంద్ర కార్యదర్శి మాదాసి రవీందర్, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, సంయుక్త కార్యదర్శి బోయిన మల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోళ్ల మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

## అసత్య ఆరోపణలు మానుకోవాలి

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేశ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలక్రైం, జూలై28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూదరి తిరుపతిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివాకర్‌రావు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. 30 ఏళ్లలో చూడలేని అభివృద్ధిని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఏడాదిలోనే చేసి చూయించారని దీనిని ఓర్వలేకనే దివాకర్‌రావు విమర్శిస్తున్నారన్నారు. అధికారులకు అండగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఉంటారని తాటాకు చప్పుళ్లకు అధికారులు భయపడరన్నారు. సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి, ఇండస్ట్రియల్ పార్కు, రాళ్లవాగు కరకట్ట, మార్కెట్‌లో రోడ్డులో సుందరీకరణ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మాజీ వైస్ చైర్మన్‌లు సల్ల మహేశ్, మామిడిశెట్టి వసుంధర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

లక్షెట్టిపేట, జులై 28(ఆంధ్రజ్యోతి): రఘునాత్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బారుల పాఠశాలలో అదే విధంగా ఇటిక్యాల పాఠశాలలో 10వ తరగతి పిల్లలకు సోమవారం విద్యాసామగ్రిని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెరబెల్లి రఘునాత్ అంద జేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన విద్యతోనే భవిశ్యత్తు ఉంటుందన్నారు. ప్రతీ విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో ఒక లక్ష్యం ఎంచుకుని దాని సాధన కోసం తపిస్తూ చదవాలన్నారు. ప్రధాని మోదీ సైతం వేల కోట్ల రూపాయలను ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో సభ్యులు వీరమల్ల హరిగోపాల్‌రావు, హేమంత్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్ జైన్, గుండ ప్రభాకర్, లక్ష్మణ్, మదు, మధూకర్, చంద్రమౌళి ఉన్నారు.

## తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలి

జైపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ రీజనల్ రీసోర్స్ పర్సన్ నాగలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం జైపూర్, వేలాల గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను, హెల్త్ సబ్ సెంటర్లను, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యానారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో బాలయ్య, కార్యదర్శులు ఉదయ్‌కుమార్, మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, జూలై28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో బూసినేని బాలక్రిష్ణ(26) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు ఎఎస్ఐ వెంకన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిలపల్లి గ్రామం సిర్పూర్‌కు చెందిన బాల క్రిష్ణ డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆటో నడపగా డబ్బులు సరిపోకపోవడంతో జల్సాలకు అలవాడుపడి తిరుగుతుండేవాడు. ఏదైన పని చేసుకొని బతకాలని బంధువులు చెప్పడంతో హైదరాబాద్‌కు వెళ్లి పని చేస్తానని మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలోకి చేరుకున్నారు. ఈక్రమంలో ఈనెల 25న గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎఎస్ఐ తెలిపారు. సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

# నడకలో రాజసం.. చూపులో గాంభీర్యం..

# అడవికే రారాజు




నస్పూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అడవి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది... వేటలో మేటి దానికి అదే సాటి.. నడకలో రాజసం...చూపులో గాంభీర్యం.. ఆ పేరు వింటేనే భయం..పెద్దపులి గాండ్రింపుతోనే సగం ప్రాణాలు గాలిలో కలిసి పోతాయి.. సామాన్యులు బెబ్బులిగా పిలుచుకునే పెద్దపులి అడవికే రారాజు.. పులి ఉనికి అడవికి అందం, పులికి రక్షణ అవసరం.. దాని పరుగు పౌరుషానికి ప్రతి రూపం.. దట్టమైన అడవులు పులుల ఆ వాసానికి నిలయం...పులి ఉన్న అడవిలో పర్యావరణానికి, పచ్చదనానికి ఏలాంటి ఢోకా ఉండదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా....

### నేపథ్యం...

ప్రపంచంలో పెద్ద పులుల సంఖ్య నానాటికి తగ్గుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రకృతి సం రక్షణ సంస్థ 1986లో పెద్దపులి జాతి మనుగడ ప్రమాదం పడినట్లు గుర్తించింది. అది అంతరించి పోతే వ్యవస్థ అంతరించి పోయే ప్రమాదం ఉంది. పులుల సంరక్షణ కోసం గ్లోబల్ టైగర్ ఫోరం ఏర్పాటైంది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా పులుల సంరక్షణపై దృష్టి సారించాయి. రష్యాలో టైగర్ సమ్మిట్‌లో అంత ర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. ఇందులో భాగంగా పులుల రక్షణ కోసం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని 2010 జూలై 29న నిర్వహించాలని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

### అవగాహన కల్పిస్తున్నాం. శివ్ ఆశిష్ సింగ్, డీఎఫ్‌వో-మంచిర్యాల



పులుల రక్షణ కోసం ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. పచ్చదనం పెరగడం వలన పర్యావరణ పరిరక్షణతో పాటు జీవరాశులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అన్ని డివిజన్లలో గడ్డి క్షేత్రాలు ఏర్పాటు చేశాం, జంతువుల దాహార్తిని తీర్చాడానికి నీటి కుంటలు, సాసర్స్ సోలార్ కేంద్రాలు తదితర పనులు చేశాం. పులి ఆవాసం ఏర్పాటు చేసుకోవడానికి ఈ అటవీ ప్రాంతాలు ఎంతో అనువైనవి. పులి ఏ పశువులను చంపితే దానికి సంబంధించిన నష్ట పరిహారం వెంటనే బాధితులకు ఇస్తున్నాం. ప్రపంచ పులులు దినోత్సవం సందర్భంగా అటవీ సంపద, వన్యప్రాణులు, వన్యమృగాల రక్షణపై పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై క్విజ్ పోటీలు, బహుమతులు అందించే కార్యక్రమాలు చేపట్టాము.

### పులి రక్షణకు టైగర్ జోన్స్...

పులుల సంరక్షణ కొరకు దేశంలో కార్యక్రమాలను చేపట్టి 1972 నవంబరు 18న పాంథెరా టైగ్రిస్ (బెంగాల్ పులి) జాతికి చెందిన పెద్దపులిని జాతీయ జంతువుగా భారత ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి పులి రక్షణ చర్యలు భాగంగా 1973 ఏప్రిల్ 1న టైగర్ రిజర్వు ప్రాజెక్టులు ప్రారంభమైయ్యాయి. 1973 చివరి నాటికి దేశ వ్యాప్తంగా తొమ్మిది అభయాణ్యాలుండగా ప్రస్తుతం దాదాపు 54కు వరకు ఉంటాయి.. ప్రపంచంలోనే అత్యధిక పులులు కలిగి ఉన్న దేశమని ఇండియా సొంతం చేసుకుంది. వాటి రక్షణ, సంఖ్య పెంపు కోసం అభయారణ్యాలను విస్తరించింది.

తెలంగాణలో అమ్రాబాద్ టైగర్ జోన్ ఉండగా రెండోది కవ్వాల్ టైగర్ జోన్‌ను పదమూడేళ్ల కిందట ఏర్పాటైంది. కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో పులులకు ఆవాస యోగ్యమైన ప్రాంతం కావడంతో పులి రాక పోకలు సాగిస్తోంది. గడిచిన పదేళ్ల కాలంలో 40 నుంచి 50 పులులు ఇక్కడకు వచ్చి సంతానోత్పత్తి అనంతరం కొన్ని వెళ్లిపోగా మరికొన్ని జిల్లాల పరిధిలోని అడవుల్లో సంచరిస్తున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. విచ్చలవిడిగా అటవీ సంపదను నాశనం చేయడం వలన అడవిలో ఉండాల్సిన పులులు అడవిని వదిలి బయటకు వస్తున్నాయి. వాటి ఆవాసాలు దెబ్బ తినడం వలన ఊళ్లలోకి చొరబడి భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి.

### కవ్వాల్ అభయారణ్యం..

రాష్ట్రంలో రెండవ టైగర్ రిజర్వు ప్రాజెక్టు 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి జిల్లాల పరిధిలో 893 చదరపు కిలో మీటర్లు కోర్ ఏరియాగా, 1123 చదరపు కిలో మీటర్ల అటవీ విస్తీర్ణాన్ని బఫర్ జోన్‌గా ప్రకటించింది. నాలుగు జిల్లాల ఆరు డివిజన్లలుగా విభజించి కవ్వాల్ సర్కిల్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలను ఖర్చు చేసినా కవ్వాల్ పులి ఆవాసం ఏర్పాటు చేసుకోక పోవడం నిరాశ కలిగిస్తోంది. కవ్వాల్ టైగర్ జోన్‌ను సరిహద్దులో ఆనుకుని తడోబా, తిప్పేశ్వర్, ఇంద్రావతి టైగర్ జోన్స్ ఉన్నాయి. ఆయా జోన్ల నుంచి పులులు కవ్వాల్ జోన్‌లోకి రాకపోకలు సాగిస్తున్నాయి. కవ్వాల్ ప్రాజెక్టు పరిధిలో అటవీ శాఖ పలు ప్రాంతాల్లో సఫారీని ప్రవేశపెట్టింది. సఫారీ వీక్షకులకు సాధారణ జంతువుల మినహా ఎక్కడ కూడా పులి కనిపించక పోవడంతో వారికి నిరాశ కలిగిస్తోంది. అయితే ఇతర టైగర్ జోన్లలోని కొన్ని పులులను ఇక్కడకు తరలించాలనే ఆలోచనకు అధికారులు వచ్చినట్లు తెలిసింది. ఆరుపులులను రానున్న రోజుల్లో మహారాష్ట్ర నుంచి తరలించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తున్నాం

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నెన్నెల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే అజెండా పని చేస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నియోజకవర్గంలో గతంలో కనివిని ఎరుగని అభివృద్ధి పనులు నడు స్తుండటమే అందుకు నిదర్శనమన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రేషన్ కార్డుల మంజూరు పత్రాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత బిల్లుల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దకాలంగా రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న పేదల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంతోషాన్ని నింపిందన్నారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, కార్డులు రాని వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తారన్నారు. నెన్నెల మండలానికి నిధుల మంజూరుకు రాజీ పడేది లేదని, అవసరమైన పనులకు అంచనాలు రూపొందించి ఇవ్వాలని కోరారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. 221 మందికి కొత్త రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు అందజేశారు. ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో అబ్దుల్ హై, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, శ్రీనివాస్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

**అటవీ అధికారులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు**

అటవి అధికారులు తమను వేధిస్తున్నారని నెన్నెల గిరిజనులు ఎమ్మెల్యే వినోద్‌కు ఫిర్యాదు చేశారు. పోడు భూముల్లో పంటలను ధ్వంసం చేస్తూ సాగును అడ్డుకుం టున్నారని అన్నారు. సోమవారం నెన్నెల మండల కేంద్రంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. నెన్నెల శివారు సర్వే నంబరు 672లో తమకు పట్టా లు ఉన్నాయని, దశాబ్దాల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారుతో మాట్లాడి పోడు సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్ ఉన్నారు.




నెన్నెలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నస్పూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు, బిల్లుల చెల్లింపుల జరుగుతున్న జాప్యం నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతకు ముందుగా ప్రధాన రహదారి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. వేతనాలు, బిల్లు చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యాశాఖ కార్యాలయంలో అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండి రఫీయా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ భోజన పథకం కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. పది నెలల నుంచి కోడిగుడ్ల, వంట బిల్లులు రావడంలేదన్నారు. సీఐటీయూ, కార్మికుల సంఘం నాయకులు గోమాస ప్రకాష్, లక్ష్మణ్, రాజారాం, రాజ్‌కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

## సెర్ప్ ఏపీఎం బదిలీ

నెన్నెల, జులై 28 (ఆంధ్రజ్యోతి) : సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి బెల్లంపల్లికి బదిలీ అయ్యారు. పదేళ్లుగా మండలంలో సేవలందించిన ఆమె మహిళల సాధికారత కోసం విశేష కృషి చేశారు. స్వయం సహాయక గ్రూపుల ఏర్పాటు, రుణాల మంజూరు, రికవరీలో మండలాన్ని అగ్రస్థానంలో నిలబెట్టారు. ఆమె సేవలకు గుర్తింపుగా పలుమార్లు జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. ఆమె స్థానంలో భీమారం ఏపీఎం త్రయంబకేశ్వర్ నెన్నెలకు రానున్నారు.

## కనువిందు చేస్తున్న జలపాతం



అందుగులపేటలోని జలపాతం

మందమర్రిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగుల పేటలోని క్షీరజలపాతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కనువిందు చేస్తుంది. గుట్టలపై నుంచి వచ్చే వరద నీరు కిందకు జాలు వారుతుండడంతో చూసేందుకు యువకులు పెద్ద ఎత్తున జలపాతం వద్దకు తరలి వెళ్తున్నారు. జాతీయ రహదారి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ జలపాతం చూడాలంటే అటవీ ప్రాంతం గుండా వెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చాలని ప్రభుత్వం అధికారులు ఇందుకోసం కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## బీఆర్‌ఎస్‌వీ నాయకుల రాస్తారోకో

చెన్నూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాద్ సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చెన్నూరు పట్టణంలోని తెలం గాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# ఆలయాల పేరిట ప్రభుత్వ భూములు స్వాహా...!

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన వార సులు ఎవరూ లేరు. రికార్డుల్లో సైతం ఎలాంటి మార్పులు జరుగలేదు. సదరు భూమి తమదేనని సిపాయి వారసులు ఎవరూ అధికారుల వద్దకు వచ్చిన సందర్భాలూ లేవు.

**ఆధార్ మార్ఫింగ్‌తో స్కెచ్...**

తిమ్మాపూర్ శివారులోని సర్వే నంబర్లు 325, 438 లో అసలు వారసులే లేని ఈ భూములకు కాల క్రమంలో నకిలీ వారసులు పుట్టుకు వచ్చారు. స్థానికంగా పట్టున్న నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి, రెవెన్యూ అధికారుల సహకారంతో భూములు చేజిక్కించుకునేందుకు భారీ స్కెచ్ వేశారు. తెరపైకి ఓ వారసుడిని తీసుకొచ్చారు. స్థానికులైతే తమ బండారం బయట పడుతుందని భావించి ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని సిపాయి వారసుడిని చేశారు. అందుకు తగినట్లు ఆధార్ కార్డును మార్ఫింగ్ చేశారు. ఆయనే వారసుడిగా నమ్మించారు. అతని పేరుతో అవసరమైన చోట్లా దరఖాస్తులు పెట్టించి, సంతకాలు కూడా చేశారు. దీంతో ప్రొసీడింగులు పుట్టుకొచ్చాయి. అలా రెండు సర్వే నంబర్లలో 40 ఎకరాలను చేజిక్కించుకోగా, ఈ తతంగం నడిపించిన వారు తలా కొంత పంచుకున్నారు.

**నకిలీ ఆధార్ బాగోతం బట్టబయలు...**

సదరు భూములను సాగు చేసుకుంటున్న రైతులు అవి ఇతరుల పేరిట పట్టాలుగా మారడంతో ఆశ్చర్యపోయారు. నకిలీ ఆధార్‌తో భూముల్లో పేరు ఎక్కిన ఆంధ్రాలోని తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం, పెద్దాపురానికి చెందిన దేవాడ రామిరెడ్డిని కలవడంతో అసలు విషయం వెలుగు చూసింది. వాస్తవానికి ఆయనకు సిపాయికి ఏ సంబంధం లేదని తెలుసుకున్న రైతులు తిరిగి వచ్చిన తరువాత ఆధారాలతో సహా తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారిపై మందమర్రి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అక్రమంగా చేజిక్కించుకున్న భూముల్లో ప్రస్తుతం క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**విద్యుత్ సౌకర్యం కోసం యత్నాలు...**

ప్రభుత్వ భూముల్లో నిర్మించిన గుడికి విద్యుత్ సౌకర్యం కోసం ముమ్మర యత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు కావడంతో ఎన్‌వోసీ ఇచ్చేందుకు విద్యుత్‌శాఖ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ క్రమంలోనే ఆశ్రమం, గుడిలో జరిగే వివిధ కార్యక్రమాలకు చెన్నూరు ఎమ్మెల్యే మంత్రి గడ్డం వివేకానందను పలుమార్లు ఆహ్వానించి, సన్మానాలు సైతం చేశారు. తద్వారా తమకు రాజకీయ అండదండలు ఉన్నాయని చెప్పుకోవడం ద్వారా లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి ఇలాకాలో ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఆ భూములను అధికారులు స్వాధీనం చేసుకోవడంతో పాటు గుడిని ఎండోమెంట్‌శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కోటపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాలు, గోదాంలను సోమవారం వ్యవసాయ శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. డీలర్ల వద్ద ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఎరువులు, యూరియాను పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డులను పరిశీలించి రైతులకు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను విక్రయిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలానికి సరిపడ యూరియా, ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. తహసీల్దార్ రాఘవేంద్రరావు, వ్యవసాయాధికారి సాయికృష్ణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నారాయణ పాల్గొన్నారు.

# హెపటైటిస్‌పై విద్యార్థులకు అవగాహన

చెన్నూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ హెపటైటీస్ దినోత్సవం సందర్భంగా వైద్యులు హెపటైటిస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెపటైటిస్ నివారణ, కాలేయ వ్యాధికి సంబంధించి పరీక్షలు, చికిత్స, నివారణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. హెపటైటిస్ నివారణకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాలేయానికి హాని కలిగించే మద్యం సేవించడం పూర్తిగా మానివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగ్రాజ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కృష్ణతేజ, బస్తీ దవాఖానా వైద్యురాలు లక్ష్మీప్రసన్న, సబ్‌యూనిట్ అధికారి జగదీష్, సూపర్ వైజర్ కళావతి, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**హాజీపూర్:** ప్రపంచ హెపటైటీస్ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని కర్ణమామిడి కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ ఈ వ్యాధి పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని, పుట్టిన బిడ్డకు వెంటనే హెపటైటీస్‌బీ వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. అలాగే విడతలవారిగా సూదులు వేయిస్తే వ్యాధిని నివారించవచ్చునని పేర్కొన్నారు. 2030 నాటికి ఈ వ్యాధిని మన దేశంలో ఒక్క కేసు లేకుండా చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్, సబ్ యూనిట్ ఆఫీసర్ నాందేవ్, ఎంఎల్ హెచ్‌పీ సుధాకర్, హెచ్‌వి పద్మ, ఎఎన్ఎం సుజాత, శ్రీలత, ఆశ కార్యకర్తలు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, సూపర్‌వైజర్ మధు పాల్గొన్నారు.

**జన్నారం:** హెపటైటిస్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ కమలాకర్ అన్నారు. సోమవారం మండలంలోని తపాలపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అవ గాహన కల్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. అపరిశుభ్రమైన ఆహారం, కలుషితనీరు రక్త మార్పిడి, పచ్చబొట్ల వల్ల హెపటైటీస్ వ్యాధి సం క్రమిస్తుందని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు మురళీధర్, దుంపల తిరుపతి, తుంగురి గోపాల్ పాల్గొన్నారు.

**మంచిర్యాలక్రైం:** హెపటైటిస్ నివారణ కోసం పిల్లలకు టీకా వేయించాలని డాక్టర్ ప్రతాప్ అన్నారు. పాత మంచిర్యాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ హెపటైటీస్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లలకు వైద్యుల సూచనల మేరకు టీకా వేయించాలని టీకాతోనే హెపటైటిస్ నివారణ సాధ్యమన్నారు. వైద్యులు స్నేహిత, నాందేవ్, సీహెచ్‌వో వెంకటేష్వర్లు, దీక్షిత, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరిస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవ న సమావేశ మందిరంలో ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 72 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్డీవో శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

కోటపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 30, 31 తేదీల్లో స్పాట్ అడ్మిషన్‌లు తీసుకుంటామని పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుందని, విద్యార్థులు విద్యార్హత ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తాం



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న రౌతు సత్తయ్య

కాసిపేట, జూలై28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అర్హులైనవారందరి రేషన్‌కార్డులు అందజేస్తామని ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 342 మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద, నిరుపేదలకు రేషన్‌దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం రేషన్‌కార్డులను మంజూరు చేసిందన్నారు. ఎవరింట్లో కూడ ఆకలి బాధలు ఉండవద్దనే ప్రభుత్వం ఏకకాలంలో రేషన్‌కార్డులను మంజూరు చేసిందన్నారు. దీంతో పాటుగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కల్యాణ లక్ష్మీ ఇచ్చి ప్రభుత్వం కట్టుబడిందన్నారు. అందుకోసం అనంతరం లబ్దిదారులందరికి రేషన్‌కార్డులను అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని సల్పలగూడలో నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను నాబార్డు డీడీఎం వీరభద్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వల్పలగూడలో వాటర్‌లో బ్యాక్టీరియా కంటిమినేషన్ ఉన్నందున ఈ గ్రామంలో వాటర్ ప్లాంట్ పెట్టాలని వాసన్ సంస్థ నాబార్డు వారిని కోరగా ప్లాంట్ మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వాసన్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్‌కుమార్, వీడబ్ల్యూసీ ప్రసిడెంట్ వెంకటేశం, కమిటీ సభ్యులు జయవర్ధన్, తిరుపతి, భీందాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో నంబర్ 49 రద్దు చేయాలి

- కదం తొక్కిన ఆదివాసీలు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం కన్జర్వేషన్ రిజర్వ్ పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 49ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితీ, తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు కదం తొక్కారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు పిలుపునివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు పెద్దఎత్తున తరలివచ్చారు. వీరి నిరసన కార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కుమరం భీం చౌక్‌లోని కుమరంభీం విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్‌కుమార్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ జడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**● పోరాటం ఉధృతం చేస్తాం..**

ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి దొంగదారిన జీవో 49ని తీసుకువచ్చిందన్నారు. ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. జీవో 49ని రద్దు చేసే వరకు నిద్రపోమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే జీవో 49ని రాష్ట్రప్రభుత్వం నిలుపుదల చేసిందని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**● కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి..**

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ జీవో 49 తీసుకురావడంలో కేంద్రప్రభుత్వ ప్రమేయం లేదన్నారు. ఎలాంటి గ్రామసభలు, తీర్మానాలు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకువచ్చిందని విమర్శించారు. జీవో తాత్కాలిక నిలుపుదల కేవలం కంటి తుడుపు చర్య అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకుండా తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో జీవో 49పై ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. జీవో రద్దు చేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని, ఆగస్టు 4న కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్టు కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చారు.

**● అడ్డుకున్న పోలీసులు..**

అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని ఇచ్చేందుకు ఆదివాసీలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెల కొంది. ఈ క్రమంలో గేట్లు తీయాలని ఆదివాసీలు తోసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేటు ఎదుట బైఠాయించి కలెక్టర్ బయటికి రావాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ,

ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్, గణేష్, ప్రభాకర్, మాంతయ్య, మడావి శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు అరిగెల మల్లికార్జున్, కొప్పుల శంకర్, వామపక్ష పార్టీల నాయకులు శ్రీనివాస్, దినకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




- సహకార సంఘాల ద్వారా ఎరువులు తీసుకున్న రైతులకు వర్తింపు
- కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి 12 నెలల వరకు
- అత్యధిక పరిమితి రూ. రెండు లక్షలు

వాంకిడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల నుంచి ఇఫ్కో ఎరువులను కొనుగోలు చేసే ప్రతీ రైతుకు ఆ సంస్థ ఉచితంగా సంకట హరణ బీమా పథకాన్ని వర్తింపజేస్తోంది. రైతులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. సంస్థ ఎరువులను కొనుగోలు చేస్తే చాలు ప్రమాదాల్లో మృతి చెందినా, అంగ వైకల్యంసంభవించినా వారికి ఈ బీమా వర్తిస్తుంది.

**● కొనుగోలు సమయంలో...**

రసీదుపై తేదీ, కొనుగోలుదారుడి పేరు, తండ్రి లేదా భర్త పేరు, చిరునామా, కొనుగోలు చేసిన ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పేరు, కొనుగోలుదారుడి సంతకం, వేలి ముద్ర ఉండాలి. కొనుగోలు అసలు రసీదుపత్రంతోపాటు కొనుగోలు వివరాల ధ్రువీకరకణకు విక్రయాల రిజిస్టర్ నకలు పత్రం, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్ట్‌మార్టం నివేదిక, మరణ ధ్రువపత్రం సమర్పించాలి. క్లెయిం పత్రాలను ప్రమాదం సంభవించిన తేదీ నుంచి రెండు నెలల్లోగా సికింద్రాబాద్‌లోని ఇఫ్కో టోకియో సాధారణ బీమా కంపెనీ లిమిటెడ్‌కు పంపించాలి.

**● అర్హతలు ఇలా...**

- ప్రాథమికంగా రైతులు సహకార సంఘాల ద్వారా ఇఫ్కో ఎరువులను కొనుగోలు చేయాలి.
- వీటిని కొనుగోలు చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే వందశాతం, రెండు అవయవాలు కొల్పోతే 50 శాతం, ఒక అవయవం కోల్పోతే 25 శాతం బీమా పరిహారం అభిస్తుంది.
- కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి 12 నెలల వరకు ఈ బీమా ప్రయోజనం ఉంటుంది.
- రహదారి ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాముకాటు, గ్యాస్ సిలిండర్ పేలడం, అగ్ని యంత్రాలవల్ల కలిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుంది.
- ప్రతి ఎరువు బస్తా లేదా నానో ఎరువు బాటిల్‌పై 10వేల రూపాయల బీమా వర్తిస్తుంది.
- అత్యధిక బీమా పరిమితి రెండు లక్షల రూపాయలు.

**● దేనికి వర్తించదు?**

- ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే ప్రమాదాలకు వర్తించదు.

**రైతులకు ఎంతో ప్రయోజనకరం..**

- జక్రే పెంటు,
పీఏసీఎస్ చైర్మన్, వాంకిడి



ఇఫ్కో సంకటహరణ బీమా రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సహకార సంఘం నుంచి ఇఫ్కో ఎరువులు తీసుకున్న ప్రతీ రైతుకు ఈ బీమా వర్తిస్తుంది. బీమా క్లెయిం కోసం అవసరం ఉన్న ధ్రువపత్రాలను రైతులకు అందుబాటులో ఉంచుకోవాలి.

## ఎంపీడీవోకు సన్మానం

బెజ్జూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం కార్యాలయంలో సిబ్బంది శాలువాతో సత్కరించి సన్మానించారు. ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తుండగా ప్రభుత్వం రెగ్యులర్ ఎంపీడీవోగా పదోన్నతి కల్పించడంతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో రాజన్న పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రజాబంధు ఫౌండేషన్ అధ్యక్షుడు, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు జిరాక్స్ రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకరావాలని కోరారు.

## ఎమ్మెల్యే పరామర్శ

కాగజ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీ 6వ వార్డు మాజీ కౌన్సిలర్ దెబ్బటి తార మృతి చెందటంతో సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆమె కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ వార్డు కోసం చేసిన అభివృద్ధిపై, రాజకీయ ప్రస్థానం గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

# సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

**- ఎమ్మెల్సీ దండె విఠల్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), జూలై 28(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను దశల వారీగా నెరవేరుస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదనిని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**బియ్యం అమ్ముకుంటే రేషన్‌కార్డు రద్దు..**

కలెక్టర్ వెంకటేష్‌దోత్రే మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న బియ్యం అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. రేషన్ షాపు డీలర్లు సైతం సన్న బియ్యం అక్రమాలకు పాల్పడితే వారిపై వేటు వేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా మంజూరు అయిన 281 రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో గిరీష్, నాయకులు సిడాం గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నాకు తరలిన ఆదివాసీ నాయకులు

సిర్పూర్(యు), జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీలు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుమ్ర భీమ్‌రావు మాట్లాడుతూ జీవో 49ను ప్రభుత్వం రద్దు చేయాలని అన్నారు.

కార్యక్రమంలో తుడుం దెబ్బ ఉపాధ్యక్షుడు ఆత్రం దౌలత్‌రావు, మడావి భోజ్జీరావు, ఆత్రం లచ్చు, లచ్చన్నసిడం సుభాష్, ఆత్రం రాము తదితరులు పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాకు నాయకులు డబ్బా క్రాస్ రోడ్డు వద్ద గల కుమరం భీం విగ్రహానికి పూల మాలవేసి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, నాయకులు సకారాం, తిరుపతి, లాలయ్య, అమృత, నారాయణ, పెంటయ్య తదితరులు ఉన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

కౌటాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఎంపీడీఓ ప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పరిశీలించారు. పాఠశాలలో ఏఎన్ఎం, హిందీ, సాంఘీక శాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గమనించారు. తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యం పరిశీలించారు. అనంతరం నాగెపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఓ పవిత్ర, ఎంపీఓ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## జిల్లాలో 7,593 రేషన్ కార్డులు మాంజూరు

**- అదనపు కలెక్టర్ డేవిడ్**

ఆసిఫాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత గల లబ్ధిదారులకు మొదటి, రెండు విడతల్లో 7,593 రేషన్ కార్డులు మంజూరు చేశామని అదనపు కలెక్టర్ డేవిడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లోని మండల కేంద్రాల్లో గల రైతు వేదికలలో, తిర్యాణి ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 28 నుంచి ఆగస్టు 5 వరకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆయా మండలాల తహసీల్దార్‌లు రేషన్ కార్డుల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అధికారులు, ఇన్‌చార్జి మంత్రి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం చేయాలని సూచించారు. అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 7,593 నూతన రేషన్ కార్డులు, 17,823 మంది సభ్యులను రేషన్ కార్డులలో చేర్చడం జరిగిందని తెలిపారు.

## నేడు మంత్రి జూపల్లి కృష్ణారావు రాక

కెరమెరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలానికి రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రానున్నట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. కేస్లాగూడ రైతు వేదికలో నూతనంగా మంజూరు అయిన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

## వైద్య సేవలు ఎలా అందుతున్నాయి?

**- ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్**



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సిర్పూర్(టి), జూలై 28(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కేశవరావును వైద్యుల ఖాళీలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు అస్లాంబీన్ అబ్బుదుల్లా పలు విషయాలపై ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో అన్నిసౌకర్యాలపై సూపరింటెండెంట్ దృష్టి సారించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అక్కడి నుంచి జిల్లాపరిషత్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న బోజనం, విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాల మహిళలతో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఎంఈవో వేణుగోపాల్ రావు, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, డాక్టర్లు అనూష, స్పందన, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం

లింగాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం అధికారులు సన్నద్ధమవుతున్నారు. గ్రామాల్లోని ఓటరు జాబితాకు తుది మెరుగులు దిద్దే పనులు పూర్తి చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ త్వరలో షెడ్యూల్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో మండలాల్లోని వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి నివేదికలను త్వరగా పంపించాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు ఇచ్చిందని సమాచారం. దీంతో పంచాయతీ అధికార యంత్రాంగం వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నులై ఉన్నారు. లింగాపూర్ మండలంలో 14 గ్రామ పంచాయతీలు, 112 వార్డులు ఉండగా 10,656 ఓట్లు ఉన్నాయి. ఓటర్ల చిరునామా ఏ వార్డులో ఉంటే అదే వార్డులో ఓటు ఉండే విధంగా అధికారులు చూస్తున్నారు.



ఓటరు జాబితా ఏర్పాటులో నిమగ్నమైన అధికారులు

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జైనూరు మండలం కోహినూర్ గ్రామానికి చెందిన శంకర్ తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం దాపూర్‌కు చెందిన శారదాబాయి తన భర్త మరణించినందున తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ ఎస్‌డీఎఫ్ నిధులతో 2023లో నిర్మించిన సీసీ రోడ్డుకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని అర్జీ సమర్పించారు. దహెగాం మండలం గిరివెల్లికి చెందిన నానయ్య తన పేరిట గల అసైన్డ్ భూమిని అటవీ అధికారులు స్వాధీనం చేసుకుంటామని చెబుతున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామానికి చెందిన గంగుబాయి తనకు ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం ఉందని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన యశోద వితంతు పెన్షన్, చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన విజయ ఇందిరమ్మ ఇలు, రెబ్బెన మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ నష్టపరిహం కోసం దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాటాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ప్రభుత్వ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలి



మొక్క నాటి నీరుపోస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. సోమవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలో పర్యటించి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, జన్కాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, యూఆర్ఎస్ ఆర్ఆర్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించి వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహించాలని, సమయ పాలన పాటించాలని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం ఏయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

## పోస్టర్ల విడుదల

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాల రక్షణ భవన్‌లో డీసీపీఓ మహేష్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన గిరిజన ప్రాంతమైన ఆసిఫాబాద్ జిల్లాలో మానవ అక్రమ రవాణాపై ప్రభుత్వంతో కలిసి స్వచ్ఛంద సంస్థలు జూలై 30న పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన తండాల్లో, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 1098, 181, 100, 122 ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాల రక్ష భవన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, నాసీర్ ఉస్మాన్, షూర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సంతోష్ కుమార్, ప్రభు, దేవాజీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్/జైనూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజనుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు, జీవన ప్రమాణాల మెరుగుదలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని డీఎస్ఎస్ భవనంలో సోమవారం నిర్వహించిన ఏడో గిరిజన మండలి సమావేంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని గిరిజన సంక్షేమం, అభివృద్ధి అనే అంశంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ రోడ్డు పునర్నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం పేద లబ్ధిదారులు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అనేక మంది ఉన్నారని వారు ఆర్థిక స్థోమత లేక ఇళ్లు కట్టుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ముందస్తుగా లక్షల రుపాయలు మంజురు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై లోతైన చర్యలు జరపాలని, గిరిజనులు విద్య, వైద్యం, తాగునీరు, రవాణా సౌకర్యాలు కల్పించడంలో వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. దీంతో పాటు అటవీ హక్కుల చట్టం అమలు, పోడు భూముల సమస్యల పరిష్కారం, గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులపై సరైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని ఆమె కోరారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించి, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి ఆవకాశాలపై దృష్టి సారించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు తగిన ప్రోత్సాహం అందించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనులు ఉన్నతి కోసం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి వాటిని పకడ్బందీగా అమలు చేయాలని, ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.